

153 వ భాగం

భాగవతం మొదలు, వ్యాసచింత – 2

నారదుడితో వ్యాసుడు చెప్తున్నాడు తన మనసులో కారణం. ముందు నారదుడు ఎలాంటివాడో చెప్పి, నువ్వు ఇంతటివాడివి కనక, త్రికాలజ్ఞానివి కనక నాకు సలహా ఇవ్వు నా చింత పోవడానికి అని అడగడం చూస్తాం ముందు పద్యాలలో.

క. పుట్టితి వజు తనువునఁ, జే
పట్టితివి పురాణపురుషు భజనము, పదముల్
మెట్టితివి దిక్కులం, దుది
ముట్టితివి మహాప్రబోధమున మునినాథా! [1-91]

వ. అదియునుం గాక, నీవు సూర్యునిభంగి మూఁడు లోకములం జరింతువు; వాయువు పగిది నఖిలజనులలోన మెలంగుదువు; సర్వజ్ఞుండ వగుటం జేసి. [1-92]

బ్రహ్మ మానస పుత్రుడు నారదుడు. నువ్వు బ్రహ్మ కుమారుడివి కదా (పుట్టితివజు తనువన; అజుడు – బ్రహ్మదేవుడు). పురాణ పురుషుడి (భగవంతుడు) భజన చేపట్టావు, దిక్కులన్నీ చుట్టూ చూసినవాడివి, జ్ఞానివి (మహాప్రబోధము). సూర్యుడిలాగా అన్ని లోకాలలోనూ చరించగలవు, వాయువు లాగా అందరిలో అన్నీ తెలుసుకునే సర్వజ్ఞుడవి.

క. నీ కెఱుఁగరాని ధర్మము

లోకములను లేదు, బహువిలోకివి నీవున్,
నా కొఱంత యెట్టి దంతయు
నాకున్ వివరింపవయ్య నారద! కరుణన్. [1-93]

నీకు తెలియని ధర్మం లేదు. అనేక విషయాలు దర్శించినవాడివి (బహు విలోకివి. విలోకనము అంటే చూడడం). నాలో సంతోషం లేకపోవడానిక్కారణం (నా కొరత) ఏమిటో చెప్పు.

ఓ చిన్న కథ దీని గురించి. బ్రహ్మజ్ఞానం రాగానే అన్నీ తెలుస్తాయి అంటూ ఇక్కడ వ్యాసుడు 'దిక్కులం తుది ముట్టితివి' అన్నాడు కదా నారదుణ్ణి. ఈ విషయం లో రమణ మహర్షి చెప్పిన విషయం చూద్దాం. ఆయన ఆశ్రమానికి ఒకసారి ఎవరో ఇద్దరు దంపతులు వేరే దేశం నుంచి వచ్చారు. రమణుల సంగతి తెల్సినదే కదా? ఎవరైనా వస్తే ఒకచూపు చూసి ఊరుకుంటారు. నిశ్శబ్దం గా కూర్చుని ధ్యానం చేసేవారికి ఏమీ సమాధానం ఇవ్వక్కర్లేదు, ఇవ్వరు; వాళ్ళకి అన్ని సందేహాలు పోయి హాయిగా వెళ్ళేవారు వెనక్కి. కానీ ఈ వేరే దేశం దంపతులు వస్తే "మీరు ఎక్కడనుంచి వచ్చారు?" అని అడిగాక చెప్పారుట – "మీరు రోజూ ఇంటి దగ్గిర్నుండి కొంత దూరం నడిచి ఫలానా చోట కూర్చుంటారు ధ్యానం కోసం, అక్కడ ఒక చెట్టు ఉంది, మరొకటి ఉందీ అంటూ విడమర్చి చెప్పి, అవునా?" అని అడిగారు. వీళ్ళకి ఆశ్చర్యం. ఈ రమణులు ఇక్కడ భారత దేశంలో ఓ మూల చిన్న ఊర్లో కూర్చుంటే పరాయి దేశంలో మేం చేసేవన్నీ మీకు ఎలా తెలిసాయి అన్నారు. 'అవన్నీ ఎందుకు, ఎలాగో ఒకలాగ తెలిసాయి లెండి,' అన్నారుట రమణులు.

ఇదే విధంగా బుద్ధుడికి జ్ఞానోదయం అయ్యాక లోకాలన్నీ పరికించి చూసాట్ట. తన ముందు బుద్ధత్వం సాధించి ఇంకా బతికున్న వారు ఉంటే వాళ్ళకి నమస్కారం చేయవచ్చు అని. ఎవరూ కనిపించలేదు. దాంతో తాను తెలుసుకున్న ధర్మానికే నమస్కారం పెట్టుకున్నాడు అంటారు. తర్వాత తనకి కొంతవరకూ దారి చూపించిన గురువులు ఉంటే వెళ్ళి 'నేను ధర్మాన్ని తెలుసుకున్నాను' అని చెప్దాం అని కళ్ళు మూసుకుని చూస్తే తెల్సింది. తనకి ఏదైనా నేర్పిన గురువులు ఎవరూ బతికిలేరు.

ఇదే బ్రహ్మ జ్ఞానం వచ్చాక 'ఏది తెలుసుకుంటే ఇంకేమీ తెలుసుకోనక్కర్లేదో అదే బ్రహ్మం అంటే' అనే శివానందుల సూక్తి. అందుకే రమణులు, బుద్ధుడూ, రామకృష్ణుల వంటివారు ఎక్కడకీ వెళ్ళనవసరం లేదు. కళ్ళు మూసుకుంటే అన్నీ తెలుస్తాయి. అయితే "ఇవన్నీ నాకు తెలుస్తున్నాయి ఇలా అవుతుంది, అలా అవుతుంది ముందు

భవిష్యత్తులో" అని గొంతు చించుకుని ఎవరికీ చెప్పరు. ఎందుకంటే ఏది ఎలా జరగాలో అనేది భగవంతుడి నిర్ణయం. అది ముందు చెప్పడానికి తామెవరు? అదీగాక ఈ బ్రహ్మజ్ఞానం అనేది ఎవరికి వారే తెలుసుకోతగ్గది. ఇదిగో తీసుకో అంటూ ఇవ్వరు, ఇవ్వకూడదు. దాన్ని తీసుకోవడానికి అర్హత ఉండాలి. బ్రహ్మం తెలుసుకున్నాక – బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి. దానిలో ఏకం అవడమే, లేదా జన్మ రాహిత్యం.

ఉ. అంచితమైన ధర్మచయ మంతయుఁ జెప్పితి వందులోన నిం
చించుక గాని విష్ణు కథ లేర్పడఁ జెప్పవు; ధర్ములప్రపం
చించిన మెచ్చునే గుణవిశేషము లెన్నినఁగాక; నీకు నీ
కొంచెము వచ్చుటెల్ల హరిఁ గోరి నుతింపమి నార్యపూజితా! [1-95]

ఇలా అడిగిన వ్యాసుడికి సమాధానం చెప్తున్నాడు బ్రహ్మవేత్త అయిన నారదుడు – "ధర్మ శాస్త్రం అంతా చెప్పావు. కానీ అందులో భగవంతుడి మీద ఏమీ లేదు (విష్ణు కథ లేర్పడఁ జెప్పవు). ధర్మ శాస్త్రం ఎంత చెప్పినా అందులో ఎన్ని విశేషాలు ఉన్నా శ్రీహరి సంకీర్తనం, భక్తీ ఎక్కడా లేవు నీవు చెప్పినవాటిలో. అందుకే నీ మనసులో చింత కలుగుతోంది." గమనించారా? ఇటువంటిదే మన జీవితాల్లో జరిగేది కూడా. చదివిన చదువు ఒకటి, చేసే ఉద్యోగం ఒకటి. ఉద్యోగం డబ్బుకోసం కనక తప్పదు. అందుకో మనకి పని అంటే భక్తీ శ్రద్ధా ఉండవు ఎందుకంటే ఇష్టంగా చేయలేం కనక. మనకి మనఃశ్శాంతి లేకపోవడానిక్కూడా ఇదే కారణం. అందుకే చేసే పని మీద, మనసులో భక్తీ శ్రద్ధా ఉండి తీరాలి.

మ. హరినామస్తుతి సేయు కావ్యము సువర్ణాంభోజ హంసావళీ
సురుచిభ్రాజితమైన మానస సరస్స్ఫూర్తిన్ వెలుంగొందు; శ్రీ
హరినామస్తుతి లేని కావ్యము విచిత్రార్థాన్వితం బయ్యు, శ్రీ
కరమై యుండ; దయోగ్యదుర్మదనదత్కాకోల గర్తాకృతిన్. [1-96]

భగవంతుడి స్తుతి లేని ఏదైనా సరే స్వర్ణ కమలాలతో (సువర్ణాంభోజ), హంసలతో కూడిన మానస సరోవరంలా ఉంటుంది. శ్రీహరి లేని కావ్యం అనేక విచిత్రమైన అర్థాలతో శుభం (శ్రీకర్ము) కలిగించేలా ఉండదు. అయోగ్యంగా కంపుకొడుతూ (దుర్మద), చప్పుళ్ళతో (నదత్), కాకుల గుంపు (కాకోల) ఉన్న గుంట (గర్తము – గుంట) లా ఉంటుంది.

మ. అపశబ్దంబులఁ గూడియున్ హరి చరిత్రాలాపముల్ సర్వపా
ప పరిత్యాగము సేయుఁ; గావున హరిన్ భావించుచుం, బాడుచున్,
జపముల్ సేయుచు, వీనులన్ వినుచు, నశ్రాంతంబు గీర్తించుచుం,
దపసుల్ సాధులు ధన్యులౌదురుగదా తత్త్వజ్ఞ! చింతింపుమా. [1-97]

అపశబ్దాలు ఉన్నా సరే శ్రీహరి చరిత్ర చెప్పే ఏ కావ్యమైనా సరే పాపాలని కడిగేయగలదు. అందుకే తాపసులు భగవంతుణ్ణి కీర్తిస్తూ, పాడుతూ, ఆయన గురించి వింటూ ధన్యులౌతూ ఉంటారు.

ఈ అపశబ్దాల మీద మరో పిట్ట కథ. గురువాయూర్ లో ఉన్న విష్ణువు గుడిలో నారాయణీయం సంస్కృతంలో రాసారు మేలపుత్తూర్ నారాయణ భట్టాత్తిరి గారు. ఏదైనా విషయం రాయాలనుకునే ముందు శ్రీహరిని ధ్యానించి రాయడం అలవాటు. ఏదైనా అర్ధం కాకపోతే గుడిలోపలకి వెళ్ళి 'ఇదిగో ఈ విషయం నాకు అర్ధం కాలేదు' అని అడిగేవారుట. అప్పుడు గుడిలోనే ఆయనకి ఓ దర్శనం అయ్యేది. అప్పుడు బయటకి వచ్చి నారాయణీయం రాయడం సాగించేవారు. అందువల్ల నారాయణీయం అంటే భగవంతుడు తన లీలలు ఎలా రాయాలో చెప్పి భట్టాత్తిరి గారి చేత రాయించుకున్నాడు అంటారు. అలా పూర్తైన గ్రంధం రోజూ ఆయన గుడిలో పారాయణ చేస్తూ ఉండేవారు. కొన్నాళ్ళకి మనసులో అహంకారం తలెత్తింది "నేను ఎంత పెద్ద గొప్ప గ్రంధం రాసానో కదా?" అని.

ఆ రోజుల్లో ఒక ఇరవై ముప్పై కుర్రాడు పొద్దున్నే వచ్చి గుడిలోకి వెళ్లబోతూంటే ఈ భట్టాత్తిరి గారు పిల్చారు. "ఇక్కడకి వచ్చే ప్రతీవారు నేను రాసి ఇక్కడ పారాయణ చేసే నారాయణీయం వినకుండా గుడిలోకి వెళ్ళరు అని నీకు తెలియదా?" అని అడిగారుట. "ఆ తప్పుల తడక నాకెందుకు, ఎదురుగా గుళ్ళో ఆయన లీలలు చూపిస్తూంటే?" అన్నాడు ఈ కుర్రాడు. అక్కడున్న అందరికీ పిడుగు పడ్డట్టు అయింది. భట్టాత్తిరి గారి తల కొట్టేసినట్టై, "ఏం మాట్లాడుతున్నావు? నువ్వెప్పుడైనా ఈ గ్రంధం చదివావా, దీని గురించి విన్నావా?" అన్నారు గొంతు పెగుల్చుకుని. దానికి కుర్రాడు సమాధానం చెప్పాడు, "మీరు చదవడం మొదలు పెట్టండి నేను తప్పులు చూపిస్తాను," భట్టాత్తిరి గారు ఒక శ్లోకం చదివారు. కుర్రాడు మొదటి పాదంలో ఒకటి, రెండో పాదంలో రెండూ, మూడో పాదంలో మూడూ అంటూ తప్పులు చూపించాడు. సభలో అక్కడున్న అందరూ మహామహులైన సంస్కృత

పండితులు. అయినా కుర్రాడు చెప్పి వాదించినట్టూ అవి తప్పులే అని వప్పుకోవాల్సి వచ్చింది. ఈ కుర్రాడి విద్వత్తుకి ఆశ్చర్యం వేసి వాళ్ళలో వాళ్ళు వాదించుకుంటూ ఉంటే ఆ కుర్రాడు అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

భట్టాత్తిరిగారికి తీరని అవమానం జరిగింది సభలో, అందులోనూ తాను సాక్షాత్తూ భగవంతుడి వాక్కు విని రాసిన నారయణీయంలో అన్ని తప్పులా? ఈయన ఏడుస్తూ ఉంటే, ఆ రోజు రాత్రి కలలో మహావిష్ణువు కనిపించి చెప్పాడు "నారాయణీయం గ్రంధం ఎవరిది? ఎవరు రాయమన్నారు నిన్ను? నేను కదా? అలా నా గురించి (భగవంతుడి లీలలు), నేను చెప్పిన విషయాలు రాసి అది నువ్వు రాసినది అని గర్వం తెచ్చుకున్నావు కదా? అందులో ఒప్పులు ఉంటే అవి నావి. తప్పులు (అపశబ్దాలు) కూడా నావే. నువ్వెవరివి మధ్యలో? నేను చెప్పి నీ చేత రాయించుకున్న గ్రంధానికి నీకు గర్వం ఎందుకొచ్చింది?" అలా ఆయనకి కళ్ళు తెరుచుకున్నాయి. ఇదే నారదుడు చెప్పే "అపశబ్దాలతో ఉన్న గ్రంధం అయినా సరే శ్రీహరి చరిత్ర చెప్పే ఏ కావ్యమైనా సరే పాపాలని కడిగేయగలదు." ఎందుకంటే భగవంతుడు అనేవాడు మనోవాక్కాయకర్మలకి అందేవాడు కాదు. ఈ శబ్దాలు మనం సృష్టించుకున్నవి కదా? ఇదే కూడా మనం కిరాతుడైన కన్నప్ప విషయంలో కూడా చూడవచ్చు – భక్తి ముఖ్యం, ఇంకేమీ అవసరం లేదు.

వ. మునీంద్రా! నిర్గతకర్మంబై నిరుపాధికం బైన జ్ఞానంబు హరిభక్తి లేకున్న విశేషంబుగ శోభితంబు గాదు, ఫలంబు గోరక కర్మం బీశ్వరునకు సమర్పణంబు సేయకున్న నది ప్రశస్తంబై యుండదు; భక్తిహీనంబు లయిన జ్ఞాన వాచాకర్మ కౌశలంబులు నిరర్థకంబులు; గావున,మహానుభావుండవు, యథార్థదర్శనుండవు, సకల దిగంత ధవళకీర్తివి, సత్యరతుండవు, ధృతవ్రతుండవు నగు నీవు నిఖిల బంధమోచనంబుకొఱకు వాసుదేవుని లీలావిశేషంబులు భక్తితోడ వర్ణింపుము; హరివర్ణనంబు సేయక ప్రకారాంతరంబున నర్థాంతరంబులు వీక్షించి తద్విపక్షాకృత రూప నామంబులంజేసి పృథగ్ధర్మనుం డైనవాని మతి పెనుగాలిచేతం ద్రిప్పంబడి తప్పంజను నావ చందంబున నెలవు సేర నేరదు; కామ్యకర్మంబు లందు రాగంబు గల ప్రాకృతజనులకు నియమించిన ధర్మంబులు సెప్పి శాసకుండ వగు నీవు వగచుట తగ; దది యెట్టు లనిన, వార లదియే ధర్మం బని జుగుప్సితంబు లగు కామ్యకర్మంబులు సేయుచుఁ దత్త్వజ్ఞానంబు మఱతురు; గావున, బుద్ధి మోహంబు జనియింపక తత్త్వజ్ఞుండవై వ్యధా వియోగంబు సేయు"మని మఱియు నిట్లనియె. [1-98]

దీని గురించి ఇంకా వివరంగా చెప్తున్నాడు – ఎంతటి కర్మ అంటనిదీ, ఉపాధి అంటూ లేనిదీ అయినదీ జ్ఞానమైనా (నిర్గతకర్మంబై నిరుపాధికం బైన జ్ఞానంబు) భగవంతుడి మీద భక్తి లేకపోతే ఎందుకూ పనికిరాదు.

భక్తిలేని జ్ఞానం, మాట, కర్మ, కౌశలం పూర్తిగా వ్యర్థం (జ్ఞాన వాచాకర్మ కౌశలంబులు నిరర్థకంబులు). ధర్మం ఇదీ, అదీ అంటూ చెప్తే వాటిలో పడి కర్మలన్నీ చేస్తూ తత్వజ్ఞానం మరిచిపోతారు జనం. అయితే మానవజీవితం పరమావధి అది కాదు కదా? అందుచేత వాసుదేవుడి లీలా విశేషాలతో భాగవతం రాయి. మామూలు మనుషుల లగా నువ్వు ఇలా విచారించకూడదు.

చ. ఎఱిఁగెడువాఁడు కర్మచయ మెల్లను మాని హరిస్వరూపమున్
నెఱయ నెఱింగి యవ్వలన నేరుపుఁ జూపు; గుణానురక్తుఁడై
తెఱకువ లేక క్రుమ్మరుచు దేహధనాద్యభిమాన యుక్తుఁడై
యెఱుఁగని వానికిం దెలియ నీశ్వరలీల లెఱుంగ చెప్పవే [1-99]

అయితే నువ్వు చెప్పే భగవంతుడి లీలలు ఎలా ఉండాలి? అన్నీ తెలిసినవాడు కర్మలన్నీ మర్చిపోయి శ్రీహరిని కీర్తిస్తూ ఉంటాడు. తెలియని వారో? త్రిగుణాలతో కూడి, ఈ శరీరం, ధనం ఇదే లోకం అనుకుంటూ జీవితం గడుపుతూ ఉంటారు. వీళ్ళిద్దరికీ తెలిసేలా ఉండాలి నువ్వు చెప్పబోయే భాగవతం, అందులో భగవంతుడి లీలలు. వచ్చే నెల వ్యాసంలో నారదుడి స్వంత కథ, ఆయన పడిన అష్టకష్టాలు చెప్పడం చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS